సాక్షి
వికారాబాద్


బుధవారం । 26 । ఏప్రిల్ । 2023



ఈత సరదా.. విషాదం కావద్దు
చిన్నారులు, యువకులు ఈత నేర్చుకునేందుకు జలాశయాలవద్ద జాగ్రత్తలు పాటించాలని ఎస్పీ కోటిరెడ్డి సూచించారు. 8లో▸



పంటమార్పుతో అధిక దిగుబడి
పంట మార్పిడి పద్ధతులతో అధిక దిగుబడి సాధ్యమని డాట్ సెంటర్ శాస్త్రవేత్త డాక్టర్ శేఖర్ అన్నారు. 9లో▸



పొంచి ఉన్న ప్రమాదం
ధారూరు మండలం కుక్కింద–అవుసుపల్లి మధ్య ఉన్న కల్వర్టు దిమ్మెలు ఊడిపోవడంతో ప్రమాదకరంగా మారింది. 9లో▸

న్యూస్‌రీల్

రేపు జాబ్ మేళా

వికారాబాద్ అర్బన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఐటీఐ కార్యాలయ ఆవరణలో గురువారం జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి షేక్ అబ్దుల్ సుబాన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్బన్ సిటీ ఇన్ఫ్రా డెవలపర్స్ లో ఉద్యోగాల కోసం సంస్థ ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సుమారు 300 మంది పురుషులను సదరు సంస్థ ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఎస్సెస్సీ, ఇంటర్, డిగ్రీ, ఎంబీఏ పూర్తిచేసి 18 నుంచి 28 ఏళ్ల లోపు వయస్సు ఉండాలన్నారు. మరిన్ని వివరాలకు 96760 47444ను సంప్రదించాలన్నారు. నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మహనీయుల ఆశయాలు సాధిద్దాం



సమావేశంలో అభివాదం చేస్తున్న కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు తదితరులు

అనంతగిరి: పూలే, అంబేడ్కర్ ఆశయసాధనే లక్ష్యం కావాలని, అందరూ ఒక్కటై రాజ్యాంగాన్ని కాపాడుదామని కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్‌వెస్లీ అన్నారు. మంగళవారం వికారాబాద్ పట్టణంలో కేవీపీఎస్ (గిరిజన సంఘం) ఆధ్వర్యంలో పూలే, అంబేడ్కర్ జన జాతర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జాన్‌వెస్లీ ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడుతూ మతోన్మాద బీజేపీ ఆటలు తెలంగాణలో సాగనివ్వమన్నారు. దేశంలో మనువాదులు భారత రాజ్యాంగాన్ని మార్చేందుకు శతవిధాలా ప్రయత్నిస్తున్నారన్నారు. దళిత, గిరిజన, మైనార్టీలపై దాడులు రోజురోజుకు పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మహనీయులు ఆశయాలు నెరవేరాలంటే ప్రతి ఒక్కరూ కంకణ బద్ధులై పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవి, కేవీపీఎస్ మాజీ అధ్యక్షుడు మల్లేశం, ఉపాధ్యక్షుడు మైపాల్, మహనీయుల జయంతి ఉత్సవాల కమిటీ జిల్లా అధ్యక్షుడు జగదీశ్, ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు నర్సింహులు, గిరిజన సంఘం అధ్యక్షుడు శ్రీను నాయక్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వీఓఏల వేతనం రూ.18వేలకు పెంచాలి



ఆర్డీఓ కార్యాలయం ఎదుట వీఓఏల నిరసన

అనంతగిరి: వీఓఏలకు కనీస వేతనాలను అమలుచేయాలని యూనియన్ జిల్లా అధ్యక్షురాలు సుజాత అన్నారు. ఈమేరకు ఐకేపీ వీఓఏ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం వికారాబాద్ ఆర్డీఓ కార్యాలయం ఎదుట నిరవధిక సమ్మె చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మట్లాడుతూ కనీస వేతనం రూ.18 వేలకు పెంచాలన్నారు. తమను వెంటనే సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. ప్రభుత్వ కార్యక్రమాలు, పథకాలు విజయవంతం చేయడంలో తాము కీలకంగా పనిచేస్తున్నామన్నారు. అయిన మా సమస్యలను ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఏళ్ల తరబడి అరకొర వేతనాలతో జీవనం సాగిస్తున్నామన్నారు. సమస్యల పరిష్కారం విషయంలో సానుకూల నిర్ణయం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రభు, పుల్లయ్య, గోవర్ధన్, దేవయ్య, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

న్యాయం జరిగే వరకు పోరాటం



పరిగిలో విద్యుత్ ఉద్యోగుల నిరసన

పరిగి: విద్యుత్ శాఖలో కింది స్థాయి సిబ్బంది అరకొర వేతనాలతో దుర్భర జీవితం గడుపుతున్నారని, తమ డిమాండ్లు నెరవేర్చే వరకు పోరాటం సాగిస్తామని ఎంప్లాయిస్ యూనియన్ హెచ్ 82 నాయకులు అన్నారు. మంగళవారం విద్యుత్ ఉద్యోగుల సమ్మెకు మద్దతుగా పరిగి పట్టణ కేంద్రంలో ఉద్యోగులు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ సమ్మె చేస్తున్న ఉద్యోగులను తొలగిస్తామని మేనేజ్‌మెంట్ బెదిరింపులకు గురిచేస్తున్నదన్నారు. భయపడే ప్రసక్తేలేదని, సమస్యల పరిష్కారమయ్యే వరకు పోరాటం చేస్తామన్నారు. పనికి తగ్గ వేతనం, ఉద్యోగ భద్ర కల్పించడంలో పూర్తిగా విఫలమైందన్నారు. కార్యక్రమంలో విద్యుత్ ఉద్యోగులు రామాంజనేయులు, ప్రకాశ్, మొగులయ్య, సురేష్, ఆంజనేయులు పాల్గొన్నారు.

గాలి వాన బీభత్సం



మొరంగపల్లిలో కుప్పలుగా వడగళ్లు

- పలు ప్రాంతాల్లో వడగళ్ల వర్షం
- దెబ్బతిన్న ఇళ్లు
- రోడ్డుపై పడిపోయిన విద్యుత్ స్తంభాలు

గాలి వాన మళ్లీ బీభత్సం సృష్టించింది. జిల్లాలో మంగళవారం సాయంత్రం మోమిన్‌పేట, బంట్వారం, మర్పల్లి మండలాల్లో ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. పలు ప్రాంతాల్లో వడగళ్లు పడ్డాయి. పంటలు, రేకుల ఇళ్లు దెబ్బతిన్నాయి. రోడ్లపై విద్యుత్ స్తంభాలు, చెట్లు నేలకూలాయి. ఫలితంగా రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడ్డాయి.

– మోమిన్‌పేట/బంట్వారం/మర్పల్లి



మర్పల్లిలో రోడ్డుపై కూలిపోయిన విద్యుత్ స్తంభం



మోమిన్‌పేట: ఎన్కెపల్లిలో గాలివానకు ధ్వంసమైన రేకుల ఇల్లు

సర్కారు ధాన్యం మాయం!

ప్రభుత్వం మద్దతు ధరకు కొనుగోలు చేసిన వరిధాన్యం పక్కదారి పడుతోంది. రైస్ మిల్లుల్లో నిల్వ ఉంచిన ధాన్యాన్ని మిల్లర్లు బియ్యంగా మార్చకుండా యథేచ్ఛగా మార్కెట్‌లో విక్రయిస్తున్నట్టు సమాచారం. పకడ్బందీగా తనిఖీలు చేయాల్సిన విజిలెన్స్ అధికారులు నామమాత్రంగా చర్యలు చేపడుతుండటమే ఇందుకు కారణంగా తెలుస్తోంది. దాదాపు పది లక్షల క్వింటాళ్ల వడ్లు మిల్లుల నుంచి మాయం అయినట్లు వినికిడి.

మిల్లర్ల మాయాజాలం
- యథేచ్ఛగా మార్కెట్‌లో అమ్మకాలు
- నామమాత్రంగా విజిలెన్స్ తనిఖీలు
- దాదాపు 10 లక్షల క్వింటాళ్ల వడ్లు తరలింపు!



రైలు మిల్లు ఆవరణలో నిలువ ఉంచిన ధాన్యం బస్తాలు

తాండూరు: ప్రతి ఏటా జిల్లాలో వరి సాగు విస్తీర్ణం పెరిగి ధాన్యం ఉత్పత్తులు ఇబ్బడిముబ్బడిగా వస్తున్నాయి. పండించిన పంటలను ప్రభుత్వం మద్దతు ధరకు కొనుగోలు చేస్తోంది. అయితే వరిధాన్యాన్ని బియ్యంగా మార్చేందుకు రైస్ మిల్లులకు తరలించారు. కానీ వ్యాపారులు బియ్యంగా మార్చకుండా నెలల తరబడి నిల్వలు ఉంచి చివరకు వ్యవసాయ మార్కెట్ కమిటీలలో విక్రయిస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. తాండూరు వ్యవసాయ మార్కెట్ యార్డులో 4లక్షల క్వింటాళ్లకు పైగా వడ్లు కొనుగోలు చేయడం అనుమానాలకు తావిస్తోంది.

జిల్లాలో 210 వరకు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి ధాన్యం సేకరించారు. ప్రతి సీజన్‌లో సుమారు 1.50లక్షల మెట్రిక్ టన్నుల చొప్పున ధాన్యాన్ని రెండు మూడేళ్లుగా కొనుగోలు చేశారు. దీంతో లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించింది. అయితే పౌరసరఫరాల శాఖ సేకరించిన వరి ధాన్యాన్ని బియ్యంగా మార్చేందుకు దాదాపు 60 రైస్ మిల్లులకు కేటాయించారు. 2020లో వరి ధాన్యం సేకరణలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య నెలకొన్న అనిశ్చితి కారణంగా ఏడాది పాటు వరి ధాన్యం నిల్వలు రైస్ మిల్లుల్లోనే ఉన్నాయి. మరో వైపు రెండేళ్లుగా సేకరించిన ధాన్యం నిల్వలు సైతం మిల్లల్లోనే ఉంచారు. అందులో అవసరాన్ని బట్టి పౌరసరఫరాల శాఖ అధికారులు బియ్యం మిల్లర్ల నుంచి సేకరించారు. కానీ ధాన్యం నిల్వలపై అధికారుల పర్యవేక్షణ లేకపోవడం గమనార్హం.

4.12లక్షల క్వింటాళ్ల కొనుగోళ్లు ఎక్కడివి..

2021–22 ఆర్థిక సంవత్సరంలో తాండూరు వ్యవసాయ మార్కెట్ యార్డులో కేవలం 28 వేల క్వింటాళ్ల వరిధాన్యం కొనుగోళ్లు జరిగాయి. అయితే ఈ ఆర్థిక సంవత్సరంలో ఏకంగా 4.18లక్షల క్వింటాళ్ల వరిధాన్యం కొనుగోళ్లు జరగడం పట్ల అనుమానాలకు తావిస్తోంది. మిల్లుల్లో నిలువ ఉంచిన ధాన్యాన్ని వ్యాపారులు వ్యవసాయ మార్కెట్‌లో విక్రయించారని వ్యాపార వర్గాలలో జోరుగా చర్చ సాగుతోంది. తాండూరు మార్కెట్‌లో ధాన్యం కొనుగోళ్లు జరిగాయంటూ ప్రచారం జరుగుతోంది. వ్యవసాయ మార్కెట్‌లో క్వింటాలు వరి ధాన్యం రూ.1,400 నుంచి రూ.1,650 ధరకు అమ్మినట్లు ప్రచారం. ఇప్పటికే రైస్ మిల్లులపై విజిలెన్స్ అధికారులు తనిఖీ చేసినా ఇప్పటి వరకు మిల్లర్లపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం విడ్డూరం.

“ మా దృష్టికి రాలేదు



రైస్ మిల్లుల్లో నిలువ ఉంచిన సర్కారు ధాన్యాన్ని మిల్లర్లు మార్కెట్‌లో విక్రయించినట్లు మా దృష్టికి రాలేదు. తాండూరు వ్యవసాయ మార్కెట్‌లో 4లక్షల క్వింటాళ్ల కొనుగోళ్లు జరిగిన విషయంపై విచారణ చేపట్టి చర్యలు చేపడతాం. జిల్లాలో ప్రతి రైతు నుంచి ప్రభుత్వ మద్దతు ధరకు వరిధాన్యం కొనుగోలు చేస్తున్నాం.

– విమల, డీఎం పౌరసరఫరాల శాఖ

పాలమూరు పారించి తీరుతం



వికారాబాద్‌లో జరిగిన మినీ ప్లీనరీలో మాట్లాడుతున్న ఎంపీ రంజిత్‌రెడ్డి, చిత్రంలో ఆనంద్

- కాలువల తవ్వకానికి త్వరలో టెండర్లు
- కేంద్రం అడ్డుపడినా అభివృద్ధిలో మనమే టాప్
- వికారాబాద్ బీఆర్‌ఎస్ ప్లీనరీలో ఎంపీ రంజిత్‌రెడ్డి

వికారాబాద్: రాష్ట్రాభివృద్ధికి కేంద్రప్రభుత్వం అడ్డుపడినా.. దేశంలోనే తెలంగాణ నంబర్ వన్‌గా నిలిచిందని, దేశానికే అన్నదాతగా మారిందని, ఇది కేసీఆర్ ఘనత అని చేవెళ్ల పార్లమెంటు సభ్యుడు గడ్డం రంజిత్‌రెడ్డి అన్నారు. మంగళవారం వికారాబాద్ పట్టణంలో ఎమ్మెల్యే ఆనంద్ అధ్యక్షతన జరిగిన నియోజకవర్గ బీఆర్‌ఎస్ ప్లీనరీలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వ తీరుపై నిప్పులు చెరిగారు. ఒకప్పుడు దేశంలో గుజరాత్ మోడల్ అంటూ బీజేపీ నాయకులు ఊదరగొట్టేవారని ఇప్పుడు తెలంగాణ మోడల్ ముందు గుజరాత్ మోడల్ చిన్నబోయిందని ఎద్దేవా చేశారు. బీజేపీ పాలిత రాష్ట్రం కర్ణాటకలో నిర్మించిన అప్పర్‌భద్ర ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇచ్చిన కేంద్రం.. రాష్ట్రంలో నిర్మిస్తున్న పాలమూరు ఎత్తిపోతల ప్రాజెక్టు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. కేంద్రం నిధులు ఇచ్చినా.. ఇవ్వకపోయినా జిల్లాలో పాలమూరు నీటిని పారించి తీరుతం .. త్వరలో జిల్లాలో కాలువలు తవ్వకానికి రూ.5180 కోట్లతో టెండర్లు పిలుస్తామని ఆయన తెలిపారు.

దమ్ముంటే పార్లమెంటుకు అంబేడ్కర్ పేరు పెట్టాలి

తెలంగాణలో 125 అడుగుల ఎత్తయిన అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడంతో పాటు సచివాలయానికి మహనీయుడి పేరు పెట్టిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, స్థానిక ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ అన్నారు. బీజేపీ ప్రభుత్వానికి దమ్ముంటే ఢిల్లీలో నూతనంగా నిర్మిస్తున్న పార్లమెంటు భవనానికి అంబేడ్కర్ పేరు పెట్టాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాలు, అమలవుతున్న సంక్షేమ పథకాలపై గ్రామ గ్రామాన అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని ఆయన ప్లీనరీకి వచ్చిన ప్రతినిధులకు సూచించారు. పాలమూరు ఎత్తిపోతల పథకం పనులు పూర్తికావచ్చాయని, త్వరలో కరివెన, ఉద్దండాపూర్ రిజర్వాయర్లను నింపుతారని, త్వరలో జిల్లాలో కాలువలు తవ్వకం ప్రారంభిస్తారని అన్నారు. నిత్యావసర వస్తువులు, గ్యాస్, పెట్రోల్, డీజల్ ధరలు పెంచిన ఘనత బీజేపీది కాదా? అని ఆయన ప్రశ్నించారు. గులాబీ కండువాకు తప్ప మరే ఇతర కండువాకు ఓటు అడిగే హక్కు లేదన్నారు.

సీఎం కుర్చీ ఖాళీగా లేదుగా..

దేశ్‌కి నేత కేసీఆర్ అని మనం ప్రచారం చేస్తుంటే.. దేశంలో ప్రధాన మంత్రి కుర్చీ ఏమైనా ఖాళీగా ఉందా అని ప్రశ్నిస్తున్నారని, మరీ రాష్ట్రంలో హంగామా చేస్తున్న వారికి సీఎం కుర్చీ ఏమైనా ఖాళీగా ఉందా? అని పార్టీ జిల్లా ఇన్‌చార్జి ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి ప్రశ్నించారు. అభిప్రాయ భేదాలుంటే కూర్చుని చర్చించుకుందామని ఆయన కార్యకర్తలు, నాయకులనుద్దేశించి అన్నారు. కార్యక్రమంలో పార్టీ ఎంపీపీలు, జెడ్పీటీసీలు, కౌన్సిలర్లు ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పది తీర్మానాలకు ఆమోదం..

వికారాబాద్‌లో నిర్వహించిన పార్టీ ప్లీనరీలో పది తీర్మానాలు ప్రవేశపెట్టడంతో సభ్యులు ముక్త కంఠంతో ఆమోదం తెలిపారు. వ్యవసాయం, దళితబంధు, విద్యా, ఉపాధి, పట్టణ, పల్లె ప్రగతి, గిరిజన సంక్షేమం, వైద్యం, స్త్రీ సంక్షేమం, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, బీఆర్‌ఎస్ ఎనిమిదేళ్ల పాలన, రాష్ట్రంపై కేంద్రం వివక్ష వంటి అంశాలపై తీర్మానం చేశారు. వీటిని ప్రజల్లోకి తీసుకెళ్లి వివరించాలన్నారు. తీర్మానం ప్రవేశపెట్టిన, ఆమోదించిన వారిలో ఖాజాపాష, విష్ణువర్ధన్‌రెడ్డి, మధుకర్, పుష్పలతారెడ్డి, నర్సింహారెడ్డి, రాజునాయక్, బాల్‌రాజ్ నాయక్, దీపా, పావని, రాంరెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, కమాల్‌రెడ్డి, రాములు యాదవ్ ఉన్నారు.

తాండూరులో ఎమ్మెల్సీ వర్గం గైర్హాజరు

తాండూరు: నియోజకవర్గ బీఆర్‌ఎస్ ప్లీనరీకి ఎమ్మెల్సీ వర్గం నాయకులంతా గైర్హాజరయ్యారు. ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డిల మధ్య ఆధిపత్య పోరు కొనసాగుతూనే ఉంది. ఎమ్మెల్యే ఆధ్వర్యంలో జరిగిన పార్టీ ప్లీనరీకి సీనియర్ ప్రజాప్రతినిధులు, నేతలు దూరంగా ఉన్నారు. ఎమ్మెల్సీ వర్గంలో ఉన్న మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్నపరిమళ్, బషీరాబాద్ మండల ప్రజాప్రతినిధులు, తాండూరు మండల ఎంపీపీ, జెడ్పీటీసీ, యాలాల జెడ్పీటీసీలతో పాటు ఇతర ప్రజాప్రతినిధులు ఎవరూ హాజరు కాకపోవడం గమనార్హం. మరోవైపు ఎమ్మెల్సీ వర్గంలోని ప్రజా ప్రతినిధుల పేర్లు వేదికపై పలకకపోవడంతో వర్గపోరు రాజకీయాలకు అద్దం పడుతోంది.

ధరణిపై నమ్మకం కలిగించండి

- ప్రతి సమస్య పరిష్కరించాలి
- కలెక్టర్ నారాయణ రెడ్డి



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్ అర్బన్: ధరణి విషయంలో ప్రజలకు నమ్మకం కలిగేలా సమాచారం ఇవ్వాలని కలెక్టర్ నారాయణ రెడ్డి రెవెన్యూ అధికారులకు సూచించారు. మంగళవారం ఆర్డీఓ, తహసీల్దార్లతో ధరణి, డబుల్ బెడ్రూం, ఓటర్ల జాబితా, బూత్ స్థాయి అధికారుల నియామకంపై కలెక్టర్ టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారుల ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ చిన్న చిన్న విషయాలకు ప్రజలు కలెక్టరేట్‌కు వస్తున్నారని, వారికి తప్పుడు సమాచారం ఇవ్వకుండా ధరణి పనులను సక్రమంగా చేపట్టాలని సూచించారు. రైతులకు సరైన సమాచారం ఇచ్చి సమస్య పరిష్కారం అవుతుందనే నమ్మకాన్ని కల్పించాలని కలెక్టర్ సూచించారు. గ్రామ పంచాయతీ కార్యదర్శులను తప్పనిసరిగా బూత్ స్థాయి అధికారులుగా నియమించాలన్నారు. బీఎల్వోలు విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. ఒక ఇంటిలో ఆరు మంది ఓటర్ల కంటే ఎక్కువ ఉంటే నేరుగా ఇంటికి వెళ్లి పరిశీలించాలని కలెక్టర్ ఆదేశించారు. ఓటర్ల జాబితా సవరణపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. డబుల్ బెడ్రూం కోసం ధ్రువీకరణ ప్రక్రియను పూర్తి చేయాలని కలెక్టర్ తెలిపారు. గురువారం నాటికి అర్హులైన వారి జాబితాను సమర్పించాలన్నారు.

వారంలోగా ప్రారంభించండి

జిల్లాలో మంజూరైన అభివృద్ధి పనులన్నీ వారం లోపు ప్రారంభించాలని కలెక్టర్ నారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం చెక్‌డ్యాంలు, మన ఊరు–మనబడి , రెండో విడత గొర్రెల పంపిణీ, తాగునీటితో పాటు వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై ఎంపీడీఓ, ఎంపీఓలు, ఏపీవోలు, ఇంజనీరింగ్ విభాగాల డీఈ, ఏఈలతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో మంజూరైన 17 చెక్‌డ్యాంలన్నింటినీ మే చివరిలోపు పూర్తి చేయాలన్నారు. దీంతో రైతులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. మన బడి పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు. ఉపాధి పనుల్లో ప్రతి జీపీలో 200 మంది కూలీలు పనిచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. రెండో విడత గొర్రెల పంపిణీకి డాక్యుమెంటేషన్ అప్‌లోడ్ చేసేందుకు దృష్టి సారించాలని కలెక్టర్ అన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ రాహుల్ శర్మ, డీఈఓ రేణుకదేవి, ఇంజనీరింగ్ ఈఈలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మలేరియాపై అప్రమత్తత అవసరం

వికారాబాద్ అర్బన్: మలేరియా వ్యాధి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పాల్వాన్ కుమార్ తెలిపారు. మంగళవారం ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకుని వైద్యాధికారులు, ఏఎన్‌ఎంలు పట్టణంలో మలేరియాపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. డీఎంహెచ్‌ఓ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమ కాటు వల్ల మలేరియా, బోదకాలు, డెంగీ, చికున్‌గున్యా, మెదడువాపు వంటి వ్యాధులు సంక్రమించే అవకాశం ఉందన్నారు. దోమలు నీరు నిల్వ ఉన్నచోట గుడ్లు పెట్టడంతో లార్వా ఏర్పడుతుందన్నారు. నీటి నిలువ ఉండకుండా జాగ్రతలు తీసుకోవాలన్నారు. దోమల నివారణే మలేరియా నియంత్రణకు మూలమన్నారు. ప్రధానంగా మన పరిసరాల్లో ఐదు రకాల దోమలు పెరుగుతాయన్నారు. అనాఫిలస్ దోమ మంచి నీటి నిల్వలో పెరిగి మలేరియా వ్యాధి వ్యాప్తి చేస్తుందన్నారు. క్యూలెక్స్ దోమ మురుగునీటి నిల్వలో పెరిగి బోదకాలు,మెదడువాపు వ్యాధిని వ్యాప్తి చేస్తుందన్నారు. ఏడిఎస్ దోమ ఇంటి పరిసరాల్లోన్ని చిన్న చిన్న నీటి నిల్వల్లో పెరిగి డెంగీ, చికన్ గున్యా వ్యాధులను వ్యాప్తి చేస్తుందని తెలిపారు. మాన్సోనియా దోమ మొక్కలున్న నీటి నిల్వల్లో పెరిగి బోదకాల వ్యాధి వ్యాప్తి చేస్తుందన్నారు. అర్మిజరిస్ దోమ సెప్టిక్ ట్యాంకులు, పారిశ్రామిక వ్యర్థాలలో పెరుగుతుందన్నారు. మరో నెల రోజుల్లో వర్షాకాలం ప్రారంభం అయ్యే అవకాశం ఉండటంతో మలేరియాతో పాటు దోమ కాటు వల్ల వచ్చే వ్యాధులపై అప్రమత్తత అవసరమన్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ జీవరాజ్, ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ సాయి బాబ, డాక్టర్ పవిత్ర తదితరులు పాల్గొన్నారు.



వికారాబాద్‌లో అవగాహన ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్ఓ పాల్వాన్‌కుమార్

కేసీఆర్‌ను హ్యాట్రిక్ సీఎం చేయాలి

- సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలి
- బీఆర్‌ఎస్ ప్లీనరీ సమావేశంలో మంత్రి సబితా రెడ్డి

పహాడీషరీఫ్: కేసీఆర్‌ను హ్యాట్రిక్ ముఖ్యమంత్రి చేసేందుకు ప్రతి కార్యకర్త ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని విద్యాశాఖ మంత్రి పి.సబితారెడ్డి అన్నారు. పహాడీషరీఫ్ ఆర్‌సీఐ రోడ్డులో మంగళవారం ఏర్పాటు చేసిన మహేశ్వరం నియోజకవర్గం బీఆర్‌ఎస్ కార్యకర్తల ప్లీనరీ సమావేశంలో ఆమె మాట్లాడారు. తొమ్మిదేళ్ల కాలంలో సీఎం కేసీఆర్ విజయవంతంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను చూస్తున్న ఇతర రాష్ట్రాల ప్రజలు తమకు ఇలాంటి సీఎం, ఇలాంటి పార్టీ కావాలంటున్నారని పేర్కొన్నారు. రైతుల క్షేమం కోసం ఢిల్లీలో చేసిన ధర్నాతో దేశం మొత్తం కేసీఆర్‌వైపు చూస్తోందన్నారు. కేటీఆర్ కమిట్‌మెంట్‌తో హైదరాబాద్ మహానగరంలో ఫ్లై ఓవర్లు, అండర్ బ్రిడ్జిలు, ఎస్‌ఎన్‌డీపీ పనులు కొనసాగుతున్నాయన్నారు. మహేశ్వరం నియోజకవర్గాన్ని కోట్లాది రూపాయలు వెచ్చించి అభివృద్ధి చేస్తున్నామన్నారు. మతం పేరుతో ప్రజల మధ్య చిచ్చుకు బీజేపీ కుట్ర చేస్తోందని ఆరోపించారు. జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితా రెడ్డి మాట్లాడుతూ.. క్లిష్టమైన తెలంగాణను ఇంత అభివృద్ధి చేస్తున్న కేసీఆర్‌కు మోదీకి ఎంతో పోలిక ఉందన్నారు. మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. తన 52 ఏళ్ల రాజకీయ జీవితంలో ఏడుగురు సీఎంలను చూశానని వారిలో కేసీఆర్ ఎంతో గొప్పగా పరిపాలిస్తున్నారన్నారు. కార్యక్రమంలో బడంగ్‌పేట్ కార్పొరేషన్ పార్టీ అధ్యక్షుడు రామిడి రాంరెడ్డి, మీర్‌పేట్ మేయర్ దుర్గా దీప్‌లాల్ చౌహాన్, డిప్యూటీ మేయర్ విక్రంరెడ్డి, యువ నాయకుడు పట్లోళ్ల కౌశిక్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

'కంటి వెలుగు' దేశానికి ఆదర్శం

ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి



కంటి వెలుగు శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

పరిగి: కంటి వెలుగు పథకం దేశానికే ఆదర్శమని ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని సయ్యద్‌మల్కాపూర్ గ్రామంలోని కంటి వెలుగు శిబిరాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కంటి వెలుగు పథకాన్ని ప్రతీ ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అంధత్వ రహిత తెలంగాణ నిర్మాణానికే సీఎం కేసీఆర్ కంటి వెలుగు పథకాన్ని చేపట్టారని వివరించారు. అర్హులంతా ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు హరిప్రియ, ఎంపీపీ అరవింద్‌రావు, పీఏసీఎస్ వైస్ చైర్మన్ భాస్కర్, సర్పంచ్ ఫాతిమాసుల్తాన్, గ్రామస్తులు వెంకటేశ్ పాల్గొన్నారు.

బీఆర్‌ఓయూ పరీక్ష షెడ్యూల్ విడుదల

మే 10 వరకు ఫీజులు, దరఖాస్తుల స్వీకరణ

కొడంగల్ రూరల్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ విద్యార్థులు మే 10లోపు పరీక్ష ఫీజు చెల్లించాలని కళాశాల ప్రిన్సిపాల్ జె.రాజారాం మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రథమ సంవత్సరం 2వ సెమిస్టర్, ద్వితీయ సంవత్సరం 4వ సెమిస్టర్, తృతీయ సంవత్సరం 6వ సెమిస్టర్ విద్యార్థులు మే నెల 10వరకు ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 6వ సెమిస్టర్ పరీక్షలు మే 31 నుంచి జూన్ 5వరకు, 4వ సెమిస్టర్ జూన్ 7నుంచి 15వరకు, 2వ సెమిస్టర్ పరీక్షలు జూన్ 16 నుంచి 22వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు.

సీఐ, ఎస్‌ఐలపై ఎస్పీకి ఫిర్యాదు

దోమ: రాష్ట్ర సాధన ఉద్యమంలో క్రియాశీలకంగా ఉన్న తనను రాజకీయంగా ఎదగనీయకుండా పరిగి సీఐ వెంకటరామయ్య, దోమ ఎస్‌ఐ విశ్వజన్ అడ్డుకుంటున్నారని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (ఆర్‌పీఐ) పార్టీ రాష్ట్ర ప్రచార కమిటీ చైర్మన్ రామన్న మాదిగ ఆరోపించారు. ఈ మేరకు మంగళవారం ఆయన సీఐ, ఎస్‌ఐలపై ఎస్పీ కోటిరెడ్డికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా రామన్న మాదిగ మాట్లాడుతూ.. తనపై గెలిచిన ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి ఇబ్బందులకు గురిచేస్తున్నాడన్నారు. ఈ నెల 23న చేవెళ్లలో నిర్వహించిన బీజేపీ బహిరంగ సభకు తననకు వెళ్లనీయకుండా పోలీసులతో అక్రమంగా అరెస్టు చేయించాడని ఆరోపించారు. చేవెళ్ల మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వరరెడ్డి, మాజీ మంత్రి ఎ.చంద్రశేఖర్ తనను సభకు ఆహ్వానించారని సభకు వెళ్లనీయకుండా అడ్డుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

గుర్తుతెలియని వృద్ధుడి మృతదేహం లభ్యం



బషీరాబాద్: మండల పరిధిలోని రెడ్డిఘణాపూర్‌లో గుర్తుతెలియని ఓ వృద్ధుడి(70) మృతదేహం లభ్యమైంది. స్థానికులు తెలిపిన ప్రకారం గ్రామానికి చెందిన శరణప్ప పొలంలో వృద్ధుడి మృతదేహం ఉన్నట్లు చూసి మంగళవారం పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు పోలీసులు మృతదేహాన్ని తాండూరు ప్రభుత్వాస్పత్రి మార్చురీకి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

93 శాతం హామీల అమలు

- రైతును రాజు చేసిన ఘనత సీఎం కేసీఆర్‌దే
- పరిగి ప్లీనరీలో చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి



మాట్లాడుతున్న చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి, చిత్రంలో ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి తదితరులు

పరిగి: బీజేపీ రాష్ట్రంపై కుట్ర పూరితంగా వ్యవహరిస్తోందని మన్నెగూడ నుంచి అప్పా జంక్షన్ వరకు హైవే కోసం భూసేకరణ చేసినా పనులను ప్రారంభించడం లేదని చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణ కేంద్రంలోని శారదా గార్డెన్‌లో నియోజకవర్గ స్థాయి బీఆర్‌ఎస్ ప్లీనరీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి నిధులు కేటాయించడంలో వివక్ష చూపుతోందన్నారు. సీఎం కేసీఆర్ ఇంటింటికీ తాగునీరు అందించేందుకు మిషన్ భగీరథ పైపులైన్ పనులు చేపడుతుంటే నవ్విన వారు ఇప్పుడు ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. రైతు బంధు, రైతు బీమా పథకాలను తీసుకువచ్చిన సీఎం రైతును రాజు చేశాడన్నారు. కోవిడ్ విజృంభిస్తున్నా సంక్షేమ పథకాలు యధావిధిగా కొనసాగాయన్నారు. దళితుల అభ్యున్నతికి ప్రవేశ పెట్టిన దళిత బంధు దశలవారీగా అర్హులందరికీ అందుతుందన్నారు. ఎన్నికల హామీలు 93శాతం అమలు అయ్యాయని వివరించారు. త్వరలోనే మిగిలిన హామీలను అమలు చేస్తామన్నారు. బీజేపీ, కాంగ్రెస్‌ల కుట్రలను ప్రజలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు: ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

అనంతరం ఎమ్మెల్యే ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. కార్యకర్తలు ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అరవింద్‌రావు, జెడ్పీటీసీ సభ్యురాలు హరిప్రియ, నాగిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ శ్యాంసుందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ భాస్కర్, మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్, పార్టీ మండల అధ్యక్షుడు ఆంజనేయులు, ప్రవీణ్‌రెడ్డి ఆయా మండలాల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

డిమాండ్‌లు సాధించే వరకు పోరాటం

తెలంగాణ విద్యుత్ ఎంప్లాయీస్ హెచ్-82 యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్

కుల్కచర్ల: డిమాండ్‌లు సాధించేంత వరకు పోరాటం కొనసాగిస్తామని తెలంగాణ విద్యుత్ ఎంప్లాయీస్ హెచ్-82 యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రధాన చౌరస్తాలో ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యుత్‌శాఖ నుంచి ప్రజలకు క్షేత్రస్థాయిలో సేవలందించే తమపై ప్రభుత్వం చిన్నచూపుచూడటం సరికాదన్నారు. తమ డిమాండ్లను సాధించుకునేంతవరకు పోరాటాన్ని ఆపమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కృష్ణ, మాధవరెడ్డి, రమేశ్, లక్ష్మణ్, సాయిలు, చంద్రకాంత్, మల్లేశ్, నర్సింలు, యాదయ్య, పరమేశ్, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న విద్యుత్ ఎంప్లాయీస్ హెచ్-82 యూనియన్ సభ్యులు

కాంగ్రెస్‌కు కార్యకర్తలు కరువు



ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డిని సన్మానిస్తున్న అభిమానులు

- బీజేపీ సభలకు కర్ణాటక నుంచి కార్యకర్తలు
- తాండూరు ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి

తాండూరు: నియోజవకర్గంలో కాంగ్రెస్ ఖతమైపోయిందని, పార్టీ జెండా మోసేందుకు కార్యకర్తలు కూడా కరువయ్యారని ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి ఎద్దేవా చేశారు. మంగళవారం బీఆర్‌ఎస్ నియోజకవర్గ స్థాయి ప్లీనరీ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా 17 అంశాలను ప్రతిపాదించి ఏకగ్రీవంగా ఆమోదించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బీజేపీ నిర్వహించిన బహిరంగ సభకు ప్రజలు లేక కర్ణాటక నుంచి తీసుకువచ్చారని విమర్శించారు. కాంగ్రెస్ నాయకులకు అమ్ముడు పోయే అలవాటుందని.. అందుకు గత ఎన్నికలే నిదర్శనమన్నారు. ఇప్పటికీ ఉన్న ఒక్కరిద్దరు నాయకులు అదే కోవాకు చెందిన వారంటూ ఆరోపించారు. ప్లీనరీకి హాజరైన ఒక్కో కార్యకర్త 25 ఓట్లు వేయించే బాధ్యత తీసుకోవాలన్నారు. ఇప్పటి వరకు దేశ వ్యాప్తంగా ఏ ఒక్క నియోజకవర్గానికి రూ.134 కోట్ల నిధులు మంజూరు చేసిన దాఖలాలు లేవన్నారు. సీఎం కేసీఆర్ తనపై నమ్మకంతో మంజూరు చేసిన నిధులను ఒక్కో గ్రామానికి రూ.50లక్షల చొప్పున కేటాయించి అభివృద్ధి పనులు చేపడతున్నామని వివరించారు. తాను తాండూరు బిడ్డననే పట్టణంలో ఇంటి నిర్మాణం చేపట్టగా కొందరు దుర్మార్గులు అడ్డుకున్నారన్నారు. అయితే జిల్లాలో ఎక్కడ లేని విధంగా ఇప్పుడు తన ఇంటి నిర్మాణం పూర్తి చేశానన్నారు. తాండూరులో తనను, రాష్ట్రంలో సీఎం కేసీఆర్‌ను అధికారంలోకి తీసుకొచ్చేలా కార్యకర్తలు పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజుగౌడ్, మున్సిపల్ వైస్ చైర్మన్ దీప, నాయకులు శ్రీశైల్‌రెడ్డి తదితరులు మాట్లాడారు.

బీఆర్‌ఎస్‌ది మానవీయ సంక్షేమ పాలన

- ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు
- బీఆర్‌ఎస్ జిల్లా ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి, చిత్రంలో ఎమ్మెల్సీ శ్రీనివాస్‌రెడ్డి

కొడంగల్: బీఆర్‌ఎస్ ప్రభుత్వం సీఎం కేసీఆర్ నేతృత్వంలో మానవీయం కోణంలో సంక్షేమ పాలన అందిస్తున్నామని బీఆర్‌ఎస్ వికారాబాద్ జిల్లా ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, కొడంగల్ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని రాఘవేంద్ర ఫంక్షన్ హాల్ నియోజకవర్గ వర్గ స్థాయి ప్లీనరీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలోని సంక్షేమ ఫలాలు అందని గడప లేదన్నారు. గ్రామాలు, మండలాలు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్‌లు శరవేగంగా అభివృద్ధి చెందుతున్నాయని వివరించారు. ఆసరా పెన్షన్లు, కల్యాణ లక్ష్మి, షాదీముబారక్, రైతు బంధు, రైతు బీమా, ఉచిత విద్యుత్, మిషన్ భగీరథ తాగునీరు, దళితబంధు, బీసీ సంక్షేమం, విద్యా ఉద్యోగాల కల్పనకు ప్రాధన్యత ఇస్తున్నామన్నారు. తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి పది సీట్లు కూడా రావని ఎద్దేవా చేశారు. పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి కొడంగల్‌లో పోటీ చేయాలని సవాల్ విసిరారు. బీజేపీ రాష్ట్రంపై వివక్ష చూపుతోందని విమర్శించారు. రాష్ట్రానికి రావాల్సిన నిధులు మంజూరు చేయకుండా అడ్డుకుంటున్నారని ఆరోపించారు. ఈ సందర్భంగా వ్యవసాయం, రైతు సంక్షేమం, సామాజిక భద్రత, మహిళా శ్రేయస్సు, బీసీ, దళిత, గిరిజన, మైనార్టీ సంక్షేమాలు, పల్లె, పట్టణ ప్రగతి, ధరల పెరుగుదల మోదీ ప్రభుత్వ వైఫల్యం, రాష్ట్రంపై కేంద్రం వివక్ష, మెడికల్ కళాశాలల ఏర్పాటు తదితర అంశాలపై ఏకగ్రీవ తీర్మానాలు చేశారు. అమరులకు సంతాపం ప్రకటించారు. ఈ సమావేశంలో జెడ్పీటీసీ సభ్యులు నాగరాణి, అరుణ దేశు, మహిపాల్, ప్రకాశ్‌రెడ్డి, ఎంపీపీలు విజయ్‌కుమార్, హేమీబాయి, కోస్గి మున్సిపల్ చైర్‌పర్సన్ శిరీష, కొడంగల్ మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ ఉషారాణి, పీఏసీఎస్ చైర్మన్లు శివకుమార్ గుప్తా, విష్ణువర్ధన్‌రెడ్డి, నారాయణపేట జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ శ్యాసం రామకృష్ణ, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు దామోదర్‌రెడ్డి, బస్వరాజ్, చాంద్ పాషా, మోహన్‌రెడ్డి, నారాయణరెడ్డి, రాంరెడ్డి, యాదగిరి, కృష్ణ, కౌన్సిలర్లు మధుయాదవ్, వెంకట్‌రెడ్డి, రమేశ్, పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఘనంగా ఆదిశంకరాచార్యుల జయంత్యుత్సవం



కొడంగల్ రూరల్: ప్రవచనాలు చేస్తున్న సర్వాత్మ నందగిరిస్వామి



బషీరాబాద్: శంకర్ స్వామీజీ ప్రవచనాలు వింటున్న భక్తులు

కొడంగల్ రూరల్: అద్వైత సిద్ధాంతాన్ని లోకానికి చాటిన ఆదిగురువు ఆది శంకరాచార్యులు అని శ్రీకాళహస్తి శుక బ్రహ్మాశ్రమం సద్గురు సర్వాత్మ నందగిరిస్వామి అన్నారు. మంగళవారం పట్టణంలోని శ్రీమహాలక్ష్మీవేంకటేశ్వర స్వామివారి ఊయల సేవ మండపంలో జగద్గురు ఆది శంకరాచార్యుల జయంతి కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా సర్వాత్మ నందగిరిస్వామి ఆధ్యాత్మిక, ధార్మిక, సత్సంగ ప్రవచనాలు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ ఆధ్యాత్మికవేత్తలు హకీంపేట కృష్ణగిరి స్వామి, ఆధ్యాత్మిక సభ్యులు, వివిధ భజన మండలిల సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సద్గురు సత్యానందగిరి స్వామి మాట్లాడుతూ భజగోవిందం అనే ఆధ్యాత్మిక ప్రవచనంతో ఆదిశంకరాచార్యులు భగవంతుడి ఆధ్యాత్మిక భావనను ప్రపంచానికి చాటారని కీర్తించారు. ఐదేళ్లకే ఉపనయనం, ఎనిమిదేళ్లకు చతుర్వేదాలు, 12ఏళ్లకు సర్వశాస్త్రాలను అధ్యయనం చేశారన్నారు. పిన్న వయస్సులోనే సన్యాసాన్ని స్వీకరించి కాలినడకన దేశమంతా పర్యటించారని వివరించారు. దేశ సాంస్కృతిక ఐక్యతకు ఆదిశంకరాచార్యులు కృషి చేయడంతో ఆయన ఆది గురువుగా చరిత్రకెక్కారన్నారు. ప్రతీ ఆది శంకరాచార్యుల ఆధ్యాత్మిక సందేశాలను పాటించాలని సూచించారు. అహంకారం, అసత్యం వీడాలని.. పరమాత్మభావనతో మెలగడంతోనే మానవుడు ఆనంద స్వరూపడవుతాడని చెప్పారు. అనంతరం భజన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆధ్యాత్మిక, ధార్మిక సేవా సమితి వ్యవస్థాపకుడు డాక్టర్ హీరాలాల్, దేవస్థానం ధర్మకర్తలు ఎస్ఎం.వెంకటరత్నం, సభ్యులు రామానంద్, బాకారం మల్లయ్య, కుమ్మరి నారాయణ, వెంకటప్ప, మొగులప్ప, కృష్ణ, బి.తుకారాం, పాండురంగయ్య, మొగులయ్య తదితరులు పాల్గొన్నారు.

భక్తితో సత్ప్రవర్తన: శంకర్ స్వామీజీ

బషీరాబాద్: భక్తిమార్గంతో మనిషిలో సత్ప్రవర్తన వస్తుందని అంబా భవాని మాత పీఠాధిపతి శంకర్ స్వామీజీ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని దామర్‌చెడ్‌లోని భవానీ నగర్‌లో వెలసిన అంబాభవానీ మాత దర్శనానికి పెద్ద ఎత్తున భక్తులు విచ్చేశారు. ఈ సందర్భంగా స్వామీజీ భక్తులకు ప్రవచనాలు భవానీ మాత పీఠాధిపతి శంకర్ స్వామీజీ బోధించారు. పాశ్చాత్య పోకడలతో నేటి యువత పెడదారి పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతీ ఒక్కరు భక్తిభావాన్ని అలవరచుకోవాలన్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

ఈత సరదా.. విషాదం కావద్దు

ఎస్పీ కోటిరెడ్డి



అనంతగిరి: వేసవిలో పాఠశాలలు, కళాశాలలకు సెలవులు రావడంతో చిన్నారులు, యువకులు సేద తీరేందుకు, ఈత నేర్చుకునేందుకు జలాశయాలవద్దకు వెళ్తుంటారని.. ప్రమాదాలు చోటు చేసుకుని ప్రాణనష్టం జరగకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్పీ కోటిరెడ్డి సూచించారు. ఈత సరదా విషాదం కాకూడదన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఎండల తీవ్రత పెరుగుతున్నందున ప్రజలు చెరువులు, కుంటలు, వాగులు, బావుల్లో స్నానాలకు వెళ్తుంటారని ఆ సయమంలో తల్లిదండ్రులు జాగ్రత్త పడాలన్నారు. కొంత మంది ఈత సరిగా రాక ప్రాణాలు కోల్పోతుంటారన్నారు. ఈ సందర్భంగా ఆయన పలు సూచనలు చేశారు.

ఈతకు వెళ్లే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు:

- ఈతరాని పిల్లలు చెరువులు, కుంటలోకి వెళ్లేటప్పుడు లైఫ్ జాకెట్లు, రబ్బర్ ట్యూబ్ ధరించడంతో పాటుగా ఈతలో అనుభవమున్న వారిని వెంట తీసుకెళ్లాలి
- నేరుగా ఎక్కువ లోతు కలిగిన ప్రాంతాల్లో కాకుండా తక్కువ లోతు ఉన్న ప్రాంతాల్లో ఈత నేర్పించాలి
- బావులు, కాల్వలు, చెరువులలో లోతు అవగాహన ఉండాలి.
- లోతులేని ప్రాంతాల్లో డ్రైవ్‌లు చేయొద్దు.
- నీటిలో ఆటలాడుతూ ఒకరిని ఒకరు ముంచుకుంటూ ప్రమాదాలు కొని తెచ్చుకుంటారు. వాటిని ప్రోత్సహించొద్దు.
- శిక్షకులు, నిపుణులు సంరక్షణలోనే ఈత నేర్చుకోవాలి.

అమిత్‌షా వ్యాఖ్యలు సరికాదు



మాట్లాడుతున్న రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రభులింగం గౌడ్

రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రభులింగంగౌడ్

మొయినాబాద్‌రూరల్: కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా చేవెళ్ల బహిరంగ సభలో బీజేపీ అధికారంలోకి వస్తే ముస్లింల రిజర్వేషన్‌లను రద్దు చేస్తామని వాఖ్యానించడం రాజ్యాంగ విరుద్ధమని ప్రభులింగంగౌడ్ అన్నారు. భారతదేశం లౌకిక రాజ్యమని ఈ విధంగా మాట్లాడడం అమిత్‌షాకు తగదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం మండల పరిధిలోని నక్కలపల్లి, తోల్‌కట్ట, కేతిరెడ్డిపల్లి, సజ్జన్‌పల్లి గ్రామాల్లో సీపీఐ జాతీయ ప్రచార జాతను మండల కన్వీనర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆయా గ్రామాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రభులింగంగౌడ్, సీపీఐ చేవెళ్ల నియోజకవర్గ కన్వీనర్ కె.రామస్వామిలు మాట్లాడుతూ.. కేంద్రంలో నరేంద్రమోదీ, రాష్ట్రంలో కేసీఆర్ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను, తెలంగాణ విభజనలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమయ్యారని మండిపడ్డారు. బయ్యారం గనులు, రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, గిరిజన యూనివర్సిటీ, పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని జాతీయం చేయడంలో ప్రభుత్వాలు పూర్తిగా విఫలమైయ్యాయన్నారు. వచ్చే ఎన్నికల్లో ఈ ప్రభుత్వాలను గద్దెదింపడమే లక్ష్యంగా సీపీఐ పని చేస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, ఏకేఎస్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు సుధాకర్‌గౌడ్, బీకేఎం జిల్లా అధ్యక్షుడు జె.అంజయ్య, మొయినాబాద్ మండల కార్యదర్శి కె.శ్రీనివాస్, వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు మల్లేష్, మహిళా సంఘం నాయకురాలు మంజుల తదితరులు పాల్గొన్నారు.

భార్య మృతికి కారణమైన భర్తకు ఐదేళ్ల జైలు

రూ.4వేల జరిమానా

ఇబ్రహీంపట్నం: భార్య ఆత్మహత్యకు కారణమైన భర్తకు ఐదేళ్ల జైలుశిక్షతో పాటు రూ.4వేల జరిమానా విధిస్తూ ఇబ్రహీంపట్నం న్యాయస్థానం తీర్పు వెలువరించింది. వివరాల ప్రకారం.. అత్తాపూర్‌కు చెందిన రాకేశ్‌కు 2007లో రష్మితో పరిచయం ఏర్పడింది. 2010లో వారు వివాహం చేసుకుని హైదరాబాద్‌లోని హ్యాపీ హోమ్స్‌లో నివాసముంటున్నారు. మద్యానికి బానిసైన రాకేశ్ భార్యను శారీరకంగా, మానసికంగా వేధించసాగాడు. 2013 మార్చి 5న తన స్నేహితులతో కలిసి విందు చేసుకుని తెల్లవారుజామున ఇంటికి వచ్చాడు. మద్యం మత్తులో ఉన్న ఆయన భార్యతో గొడవపడి అసభ్యపదజాలంతో దూషిస్తూ చేయిచేసుకున్నాడు. దీంతో జీవితంపై విరక్తి చెందిన రష్మి బలవన్మరణానికి పాల్పడింది. బాధితురాలి బంధువుల ఫిర్యాదు మేరకు ఇబ్రహీంపట్నం పీఎస్‌లో కేసు నమోదు చేశారు. కేసు పూర్వాపరాలు పరిశీలించిన అసిస్టెంట్ సెషన్స్ కోర్టు జడ్జి ఇందిర నిందితుడికి ఐదేళ్లజైలు శిక్షతో పాటు రూ.4 వేల జరిమానా విధిస్తూ మంగళవారం తీర్పునిచ్చారు. కాగా నిందితులను దోషులుగా నిర్ధారించడానికి కృషి చేసిన ఐఓ, సీడీఓ, ఏడీఎల్ పీపీలను రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్, జాయింట్ సీపీ సత్యనారాయణను అభినందించి, రివార్డులు ప్రకటించారు.

రెస్టారెంట్స్, దాబాలపై ఎస్‌ఓటీ దాడులు

కృత్తిక దాబా యజమానిపై కేసు

శంకర్‌పల్లి: మండల పరిధిలోని రెస్టారెంట్, దాబాలపై మంగళవారం ఎస్‌ఓటీ పోలీసులు దాడులు నిర్వహించారు. దొంతాన్‌పల్లి ఇక్ఫాయి కళాశాల వద్ద దాబాల్లో, రెస్టారెంట్‌లో మద్యం విక్రయాలు, సిట్టింగులు నిర్వహించకూడదని సోమవారం శంకర్‌పల్లి పోలీసులు హెచ్చరించారు. పోలీసుల ఆదేశాలను బేఖాతరు చేస్తూ మోకిల శివారుల్లోని కృత్తిక దాబా యాజమాని సిట్టింగ్ నిర్వహిస్తూ మద్యం విక్రయాలు చేపడుతున్నారని పోలీసులకు సమాచారం అందింది. దీంతో ఎస్‌ఓటీ పోలీసులు దాడులు నిర్వహించి యజమాని ముక్తార్‌ను అదుపులోకి తీసుకుని శంకర్‌పల్లి పోలీసులకు అప్పగించారు. దాబా యజమానిపై శంకర్‌పల్లి పీఎస్‌లో కేసు నమోదు చేశారు. ఈ కళాశాల ప్రాంతంలో దాబాల్లో మద్యం నిల్వలున్నాయని.. సిట్టింగ్‌లు ఏర్పాటు చేస్తున్నారని.. హుక్కా సెంటర్‌లు కొనసాగిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కఠిన చర్యలు తీసుకోవాలని పలుగ్రామాల ప్రజాప్రతినిధులు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

రవి ప్రకాష్ హర్మాళ్‌కు 'తెలంగాణ రత్న'

షాద్‌నగర్: అంతర్జాతీయ తెలుగు సాంస్కృతిక మహోత్సవాల సందర్భంగా వివిధ రంగాల్లో సేవలు అందించిన వారికి అఖిల భారత తెలుగు సాంస్కృతిక సమాఖ్య ఆధ్వర్యంలో తెలంగాణ రత్న అవార్డులను అందజేశారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఆవరణ ఆడిటోరియంలో అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. సాంస్కృతిక, సామాజిక సేవా విభాగంలో షాద్‌నగర్ పట్టణానికి చెందిన యువ కవి రవి ప్రకాష్ హర్మాళ్ తెలంగాణ రత్న అవార్డును సమాఖ్య వ్యవస్థాపక జాతీయ కార్యదర్శి డాక్టర్ విజయ్‌కుమార్, వకులాభరణం కృష్ణమోహన్‌రావు చేతుల మీదుగా అందుకున్నారు.



అవార్డు అందుకుంటున్న రవిప్రకాష్ హర్మాళ్